క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం



కార్యక్రమంలో పాల్గొన్న పాస్టర్ నిస్సీ కుమార్ తదితరులు

అడ్డతీగల : స్థానిక సీతారామరాజు కాలనీలో గల బెతేస్థ ప్రార్థన మందిరం వద్ద రక్తదాన కార్యక్రమాన్ని పాస్టర్ నిస్సీ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో 20 మంది రక్తదానం చేశారు. రంపచోడవరంప్రభుత్వ ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కి అందజేశారు. ఈ కార్యక్రమం నిర్వాహకుడు నిస్సీ కుమార్ మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలన్నారు. ఇలాంటి రక్తదాన శిబిరాలు మరెన్నో ఏర్పాటు చేసి కొంతమంది ప్రాణాలైనా కాపాడుతామని, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పూజలు చేస్తున్న భక్తులు

కొయ్యూరు: మండల కేంద్రంలోని రామాలయం నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అనేక మంది దంపతులతో ప్రత్యేక పూజలు చేయించారు. గతంలో ఇక్కడ రామాలయం ఉండేది. అది నిర్మించి, చాలా సంత్సరాలు కావడంతో పూర్తిగా శిథిలమైంది. దీంతో గ్రామస్తులు కొత్తగా రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దుర్గమ్మ ఆలయం ధర్మకర్త ఎం.వి.ఎస్.ప్రసాద్, సభ్యులు చక్రరావు(చిన్న)., వీర్రాజు, నాగు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం త్వరితగతిన పూర్తిచేసేందుకు అంతా పూనుకోవాలని తలంచారు.

పాఠశాల పునఃప్రారంభం రోజే హాజరు కావాలి

- ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి



చింతపల్లి: దసరా సెలవులు అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యార్థులు విధిగా హాజరుకావాలని స్థానిక ఏటీడబ్ల్యూవో బి.జయనాగలక్ష్మి అన్నారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు దసరా సెలవులు అనంతరం ఈ నెల 3న పునఃప్రారంభం కానున్నట్టు చెప్పారు. దసరా సెలవులకు ఇళ్లకు వెళ్లిన విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాలలు తెరిచిన తొలిరోజే హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయులు విధిగా పాఠశాలకు హాజరైన విద్యార్థులకు వెద్య సిబ్బందితో వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

రహదారులు జలమయం



రహదారిని ముంచెత్తిన వర్షపునీరు

సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలు తగ్గడం లేదు. బుధవారం ఉదయం మంచు కురిసి మధ్యాహ్నం కాస్తంత ఎండ కాసి సాయంత్రం నాలుగు గంటలకు గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో సీలేరు మెయిన్‌రోడ్డు జలమయమైంది. వర్షపునీరు దిగువకి ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

కార్మికుల సమస్యలపై న్యాయ పోరాటం

రాజవొమ్మంగి: అల్లూరి జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యదర్శిగా పుట్టా రామరాజు (రాజవొమ్మంగి) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సంఘం సభ్యుల సమావేశం బుధవారం రంపచోడవరంలో జరిగింది. మరో 26 మంది కార్యవర్గ సభ్యులను ఈ సమావేశంలో ఎన్నుకొన్నారు. కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తామన్నారు.

వైద్యుల సమ్మెతో రోగులకు అవస్థలు



రోగుల వివరాలు నమోదుచేస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యూరు: వైద్యులు సమ్మెబాట పట్టడంతో ఆస్పత్రులకు వచ్చిన రోగులు అవస్థలు పడుతున్నారు.వారిని స్టాఫ్ నర్సులు పరీక్షించి తగిన రీతిలో వైద్యం చేస్తున్నారు. మండలంలో రాజేంద్రపాలెం ఆస్పత్రికి రోగులు భారీగా వచ్చారు. వైద్య సిబ్బంది వివరాలు నమోదు చేసి, సేవలందించారు.

దారుణ దారులు

- రాళ్లు తేలిన రహదారులతో ఇక్కట్లు
- చినుకు పడితే చిత్తడే
- గోతులతో సతమతం
- వాహనచోదకుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



రాజవొమ్మంగి - అప్పలరాజుపేట దారి దుస్థితి



రాజవొమ్మంగి- అమ్మిరేఖల వరకు అసంపూర్తిగా ఉన్న రహదారి



చిత్తడిగా ఆర్‌వీ నగర్-సీలేరు రహదారి



లోలంగిపాడు రహదారి దుస్థితి

రాజవొమ్మంగి: మా తాత, తండ్రి ఆ తరువాత మేము మా పిల్లలం ఈ బురద దారిలోనే నడుస్తున్నామని, నేటికి మా గ్రామాలకు పూర్తిస్థాయి రహదారి లేదని గిరిజనులు వాపోతున్నారు. అటవీ ప్రాంతంలో ఈ రహదారి అభివృద్ధికి ఇటు ప్రజాప్రతినిధులు, అటు ఉన్నతాధికారులు పట్టించుకోడం లేదని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజవొమ్మంగి మండలం బడనాంపల్లి పంచాయతీ, అప్పలరాజుపేట, అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ, కొత్తవీధి, కోసూరివారివీధిలకు సుమారు 9 కిలోమీటర్ల నిడివిగల రహదారి నిర్మాణాలు కొన్నేళ్లుగా నిలిచిపోయాయి. కొంత మేర బీటీ రోడ్ వేసి చాలా వరకు అసంపూర్తిగా వదిలిపెట్టేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆయా గ్రామాలకు బీటీ రోడ్డు మంజూరు కాగా వాటి నిర్మాణం పూర్తి చేసేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు మీన మేషాలు లెక్కించడంతో పనులు నిలిచిపోయినట్టు స్థానికులు విమర్శిస్తున్నారు. వర్షం వస్తే ఈ రహదారిపై గల పెద్ద పెద్ద గోతుల్లో నీరు చేరడంతో వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రమాదాల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని ఆర్.వి.నగర్, గూడెం, పాలగెడ్డ, సీలేరు అంతర్రాష్ట్ర రహదారి మృత్యు కుహరంగా మారింది. ఈ రోడ్డు పై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి. ఈ రహదారి పాడై రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంత వరకు దీనిని మరమ్మతు చేయలేదని స్థానికులు చెబుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రహదారి సరిగా లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పాడేరు రూరల్: మండలంలో సలుగు పంచాయతీ కెలోలంగిపాడు రోడ్డు అధ్వానంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు చిత్తడిగా మారడంతో వాహనాదారులు రాకపోకలకు అంతరాయం కలిగింది. అత్యవసర వాహనాలు గ్రామాల్లోకి రాని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

చింతపల్లి: మండలంలో పిడుగుపాటుకు మేకలు మృతి చెందిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తాజంగిలో టిక్కరుపాడు వీధిలో నివాసముంటున్న లక్ష్మణరావు మేకలు పెంపకమే ఆదాయ జీవనాధారంగా జీవిస్తున్నాడన్నారు. బుధవారం మధ్యాహ్నం హఠాత్తుగా కురిసిన పిడుగుల వర్షానికి 13 మేకలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయన్నారు. అదే సమయంలో ఎద్దును తోలుకురావడానికి కొంతదూరం వెళ్లిన లక్ష్మణరావు పిడుగుపాటు నుంచి బయటపడ్డాడని లేకుంటే మృత్యువాతపడేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. మేకలే ఆదారంగా జీవిస్తున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ప్రకృతి వైపరీత్యాల వలన జరుగుతున్న నష్టాలకు ప్రభుత్వమే ఆదుకుని పేద రైతు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

ఘనంగా కాఫీ దినోత్సవం



మాట్లాడుతున్న అధికారులు

అరకులోయటౌన్: అరకులోయ కాఫీ బోర్డు అధికారులు బుధవారం ఘనంగా కాఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాఫీ బోర్డు మెంబర్ తాంగుల విశ్వనాథం, జూనియర్ లైజన్ ఆఫీసర్ లక్ష్మీ, రవికుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కాఫీ బోర్డు సభ్యుడు తాంగు విశ్వనాథం మాట్లాడుతూ కాఫీ రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందన్నారు. సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఇండియా కాఫీ యాప్‌లో ప్రతీ కాఫీ రైతు నమోదు చేసుకోవాలన్నారు. ఐటీడీఏ లైజన్ వర్కర్‌లు, కాఫీ రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రంపచోడవరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

రంపచోడవరం: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ నాయకుడు పుట్టా రామరాజు అన్నారు. స్థానిక యూటీఎఫ్ భవనంలో బుధవారం జిల్లా మొదటి మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ భవనం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు రమణరావు, జిల్లా కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ 2024 ఎన్నికల ముందు కూటమి పెద్దలు అధికారంలోకి వస్తే కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం పూర్తవుతున్నా సంక్షేమ బోర్డు ఊసే లేదన్నారు. సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం కేంద్రంగా భవన నిర్మాణ కార్మికుల అవసరాలకు లేబర్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు.సొంత ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ కార్యదర్శిగా పి.రామరాజు, అధ్యక్షుడిగా తోట శ్రీనివాసులు, కోశాధికారిగా గుల్లల సురేష్, గౌరవ అధ్యక్షుడిగా పల్లపు వెంకట్‌లు ఎన్నికైయ్యారు.

వీవోఏల సమస్యలపై వినతి



వెలుగు కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న యానిమేటర్లు

రాజవొమ్మంగి: తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు బుధవారం ఆందోళన చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే గురువారం నుంచి విధులను బహిష్కరిస్తామన్నారు. యానిమేటర్ల, బుక్ కీపర్ల మూడేళ్ల కాలపరిమితి జీవో రద్దు చేయాలని, వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు కూటమి నాయకులు వీవోఏల సమస్యలు పరిష్కరిస్తామని ప్రకటించి, నేడు అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోకపోవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ యానిమేటర్స్ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ ఆందోళన కార్యక్రమం చేపట్టామన్నారు. వీవోఏలు చినతల్లి, ఈశ్వరమ్మ, నూకరత్నం, రత్నం, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపో డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ తహసీల్దార్ నరేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

చింతపల్లి: మండలంలోని రేషన్ డిపోలకు ప్రతి నెల 25తేదీ లోగా సరకుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని జీసీసీ డిపో డీలర్లు సంఘం ప్రతినిధి బొడు రామారావు కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు నరేంద్రకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న ఎం.ఎల్.ఎస్.పాయింట్ నుంచి సరుకులను తూకం వేసి, ప్రతి నెలా 25 తేదీ లోగా తమ డిపోలకు సరుకులు అందించాలన్నారు.అదే విధంగా ప్రస్తుతం ఆన్‌లైన్ కావడంతో ప్రతి డిపోకు తూకం మిషన్‌లను అందించాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బియ్యం, ఇతర సరకులు వేర్వేరుగా కాకుండా అన్ని సరుకులు ఒకేసారి డిపోలకు అందేలా చర్యుల తీసుకోవాలని కోరారు. డీలర్లు నెహ్రూ, రాంబాబు, వెంకటరమణ, రాజు, మల్లుపడాల్ పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోకు పోలవరం నిర్వాసితుల వినతి



చింతూరు ఐటీడీఏ పీవో శుభమ్ నొఖ్వాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూనవరం: గృహాలకు సంబంధించి స్ట్రక్చర్ వ్యాల్యూ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి గోదావరి వరద బాధల నుంచి విముక్తి కలిగించాలని కొండ్రాజుపేట గ్రామస్తులు సీపీఐ డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహన్‌రావు ఆధ్వర్యంలో చింతూరు ఐటీడీఏ పీవో శుభమ్ నొఖ్వాల్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. పోలవరం ముంపు కింద సర్వేలను పూర్తిచేశారని, ఆవార్డు ఎంక్వయిరీ జరిగి ఏడాదైందని, ఇప్పటికైనా స్ట్రక్చర్ వ్యాల్యూ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూమికి భూమి తదితర సమస్యలను పరిష్కరించాలని ఆ వినతిలో పేర్కొన్నారు. ఆయా సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఏడాది సంభవించిన గోదావరి వరదలు నాలుగు మండలాల్లో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేశాయని, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. నిర్వాసితులకు త్వరితగతిన ప్యాకేజి ఇవ్వాలని వారు కోరారు. నాయకులు రంజాన్, మురళి తదితరులున్నారు.

బ్రహ్మోత్సవాల్లో కోలాటం బృందం

మాకవరపాలెం: తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవా ల్లో మాకవరపాలెం, నర్సీపట్నానికి చెందిన కోలాట బృందం సభ్యులు సందడి చేశారు. దాస సాహిత్య ప్రాజెక్టు, టీటీడీ ద్వారా పరమేశ్వరశర్మ, శిరీష దంపతుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో కోలాటం నిర్వహించారు. మాడ వీధుల్లో గజ వాహనం, సూర్యప్రభ వాహనాల ముందు పల్లె పడుచు వేషధారణల్లో కోలాటం చేసే అవకాశం తమకు దక్కిందని బృందం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

సంతలో నాటుకోళ్లకు గిరాకీ

కె.కోటపాడు: చౌడువాడ గ్రామంలో బుధవారం జరిగిన వారపుసంతలో నాటు కోళ్ల ధరలకు రెక్కలొచ్చాయి. విజయదశమి పర్వదినం సందర్భంగా నాటుకోళ్ల కోసం పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు సంతకు వచ్చారు. 2 కిలోల బరువు గల కోడిపుంజుల ధర ఒక్కొక్కటి రూ.1500 నుంచి రూ.2వేల వరకూ పలికాయి. ధరలు పెరిగినా పండగ నేపథ్యంలో కోనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. దీంతో నాటుకోళ్ల అమ్మకాల వద్ద సందడి నెలకొంది.

దేవరాపల్లిలో గడ్డివాము దగ్ధం

దేవరాపల్లి: దేవరాపల్లిలో సన్యాసమ్మకి చెందిన గడ్డివాము మంగళవారం రాత్రి దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో సంఘటనలా స్థలానికి వచ్చిన అగ్నిమాపక శకటం సిబ్బంది మంటలను అదుపు చేశారు. బంగారమ్మపాలెంకు వెళ్లే రహదారిలో రోడ్డుకు ఆనుకొని ఉన్న తమ కల్లంలో పాడి పశువుల మేత కోసం రూ.40 వేలు విలువ చేసే 11 ట్రాక్టర్ల గడ్డిని కొనుగోలు చేసి గడ్డిమేటు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం సాయంత్రం తాము కల్లం నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత గిట్టని వారు తమ గడ్డివాముకు నిప్పు పెట్టి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

జీఎస్టీపై అవగాహన



సమావేశంలో జీఎస్టీ తగ్గింపు కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే. శిరీష, పీవో స్మరణ్‌రాజ్



గెమ్మెలి పంచాయతీ కేంద్రంలో గిరిజనులకు జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి కృష్ణ

రంపచోడవరం: ప్రతీ పేదవాడు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వివిధ రకాలైన వస్తువులపై జీఎస్టీలో భారీ తగ్గింపు చేసినట్టు రంపచోడవరం ఎమ్మెల్యే శిరిషాదేవి చెప్పారు. ఐటీడీఏ సమావేశపు హాలులో బుధవారం మహిళాల సంఘాలు, వర్తక సంఘాల సభ్యులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఐటీడీఏ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్, జీఎస్టీ డీసీ పద్మజ, అసిస్టెంట్ కమిషనర్ వి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: గిరిజన రైతాంగం ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి టి.మధుసూదనరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి రైతులు డీలర్లుతో కలసి వారపు సంతలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలు, ఎరువులు, పురుగు మందులపై 7 శాతం జీఎస్టీని తగ్గించిందని, దీంతో రైతులకు ఖర్చు ఆదా అవుతుందన్నారు. ఈ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు వ్యవసాయ అవసరాలను కొనుగోలు చేసుకోవాలన్నారు. లాబ్ ఏవో అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీలో పలు గ్రామాల్లో ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజ్ ఆదేశాల మేరకు బుధవారం జీఎస్టీ- సూపర్ సేవింగ్స్(జీఎస్టీ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో నూతన ఒరవడి ఆరంభమవుతుందన్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిలు, గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

దసరా వ్యాపారాలు డల్

- వరదలతో తగ్గిన కొనుగోళ్లు
- తీవ్రంగా నష్టపోయామంటున్న వ్యాపారులు



చింతూరులో కొనుగోలుదారులు లేక ఖాళీగా ఉన్న కిరాణా దుకాణం

చింతూరు: దసరా పండగొచ్చిందంటే వ్యాపారాలు నిండుగా ఉంటాయి. ప్రజల కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా కనిపిస్తుంటాయి. పండుగ బేరాలు బాగా ఉంటాయనే ఆశతో వ్యాపారులు సైతం లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి అధిక మొత్తంలో సరకు తీసుకుని వచ్చి దుకాణాలను నింపేస్తారు. కాగా ఈ ఏడాది దసరా పండగ మాత్రం చింతూరు డివిజన్ వ్యాపారులతో పాటు సామన్య ప్రజలను సైతం కళలేని పండగగా మార్చేసింది. ప్రస్తుతం చింతూరు డివిజన్లో వరద పరిస్థితులు నెలకొనడంతో వందకు పైగా గ్రామాల చుట్టూ వరదనీరు చేరడంతో ఆయా గ్రామాల ప్రజలంతా సరకుల కొనుగోలు నిమిత్తం మండల కేంద్రాలకు వెళ్లాలేని పరిస్థితి నెలకొంది. దీంతోపాటు నిత్యం వర్షంకూడా పడుతుండడంతో మరికొన్ని గ్రామాల ప్రజలు కూడా పండగ కొనుగోళ్లపై పెద్దగా ఆశక్తి చూపలేదు. పండుగ కొనుగోళ్లతో మండలకేంద్రాల్లో రద్దీగావుండే దుస్తులు, కిరణా, ఫ్యాన్సీ, మొబైల్ దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

పండగ సందడి లేదు



ప్రతి ఏడాది దసరాకు దుస్తులు బాగా అమ్ముడయ్యేవి. నాలుగు రోజుల ముందునుండే కొనుగోళ్లు జరిగేవి. ఈ ఏడాది కూడా బేరాలు బాగా వుంటాయిన భావించి సరకు తేవడం జరిగింది. వరదలు ఉండడంతో కొనుగోళ్లు బాగా పడిపోయి తీవ్రంగా నష్టపోయాం. సందడి లేదు.

– ఎండీ బాషా, వస్త్ర వ్యాపారి, చింతూరు

కొనుగోలుదారులు బాగా తగ్గారు



వరదల కారణంగా ఈ ఏడాది వినియోగదారుల సంఖ్య బాగాతగ్గింది. అమ్మకం కోసం తెచ్చిన సరకులు కొనుగోళ్లు లేక మిగిలిపోయింది. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదు.

– కత్తిక శ్రీనివాసరావు, కిరాణా వ్యాపారి, చింతూరు